క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని న్యూ కాలనీలో నివాసముంటున్న పురోహితుడు విశ్వనాథ సంతోష్ కుమార్, బాల గాయత్రిల కుమార్తెలు కామేశ్వరి లక్ష్మీదీక్షిత, కామేశ్వరి వీక్షితల పుట్టినరోజు పురస్కరించుకొని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ నైట్ షెల్టర్ ఆవరణలో అన్నప్రసాదాన్ని సోమవారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.పైడి సింధూర నైట్ షెల్టర్‌లో అన్నప్రసాదాన్ని అందించి మాట్లాడారు. చిన్నారులు నిరాశ్రయుల మధ్య జన్మదినం జరుపుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమానికి సహకరించిన ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్, లయన్ పాడుగు చరణ్, దాతలు విశ్వనాథ సంతోష్ కుమార్, బాల గాయత్రిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల సదనం ఆకస్మిక తనిఖీ



శిశుగృహాన్ని సందర్శిస్తున్న హరిబాబు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి ప్రాంతంలోని శిశు గృహం, బాల సదనాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మౌలిక సదుపాయాలను పరిశీలించి, పిల్లల వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సవివరంగా ఆరా తీశారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితులు, విద్యా అవకాశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆడ పిల్లలపై మరింత శ్రద్ధ చూపాలని, సమయానుసారంగా పోషకాహారం అందించడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అంతేకాక సిబ్బందికి అవసరమైన న్యాయపరమైన సలహాలు, మార్గదర్శకాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో శిశుగృహ మేనేజర్ కె.నరేష్, బాలసదనం (ఎఫ్‌ఏసీ) సూపరింటెండెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం: జిల్లాలోని యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మెప్మా పీడీ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో జాబ్‌మేళాను ఎమ్మెల్యే శంకర్, జిల్లా అధికారులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగ యువతీ, యువకులు ప్రత్యేకంగా డిజైన్ చేసిన మెప్మా వెబ్‌సైట్‌లో వారి పూర్తి వివరాలను పొందుపరచాలని సూచించారు. టాటా ట్రెండ్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, హెటిరో ఫార్మసీ, పేటీఎం, ఇండస్ బ్యాంక్, జస్ట్ డయల్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్ తదితర కంపెనీలు మేళాలో పాల్గొంటాయని వెల్లడించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సక్రమంగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి సూచించారు. మండలంలోని గొబ్బూరు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే అనేక వ్యాధుల నుంచి బయటపడవచ్చునన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు, బాల్య వివాహాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంకుశ వైఖరి నశించాలి



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ తమిళనాడు చీఫ్ జనరల్ మేనేజర్ అక్కడి ఉద్యోగులపై అవలంభించిన నిరంకుశ వైఖరి నశించాలని జిల్లా ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఇన్ బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు అన్నారు. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఇన్ బీఎస్ఎన్ఎల్ ఆలిండియా ఇచ్చిన పిలుపులో భాగంగా బీఎస్ఎన్ఎల్ తమిళనాడు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా సోమవారం భోజన విరామ సమయంలో శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు పోలాకి వెంకటరావు, ఎస్.రాంబాబు, శ్రీహరి, డి.యోగీశ్వరరావు, సూర్యనారాయణ, పీవీ రమణ తదితరులు మాట్లాడుతూ తమిళనాడులోని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలపై అక్కడ ఉన్న యూనియన్ నాయకులు అక్కడి చీఫ్ జనరల్ మేనేజర్‌తో చర్చించడానికి వెళ్తే వారితో దురుసుగా మాట్లాడడమే కాకుండా యూనియన్ నాయకులను టార్గెట్ చేసి వారికి ఛార్జిషీట్‌లను ఇచ్చి మానసిక వేధింపులకు గురిచేయడం దారుణమని ఆవేదన తెలిపారు.

పాలిథిన్ భూతం..!



గ్రామాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- విచ్చలవిడిగా వ్యాపారుల విక్రయాలు
- కానరాని నియంత్రణ
- పట్టించుకోని అధికారులు

ఎచ్చెర్ల: పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. వీటి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. దీనిని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నారు. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రస్తుతం ఏ ప్రాంతంలో చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగం కొనసాగుతూనే ఉంది. కిరాణా దుకాణాల్లో వీటి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు చిన్న, చిన్న దుకాణాలతో పాటు సంతల్లో నిత్యం వీటి వాడకం పరిపాటిగా మారింది. ఈ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించిన అనంతరం ఎక్కడబడితే అక్కడ పారేయడంతో అవి భూమిలో కలవకుండా పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.



ప్లాస్టిక్ చెత్తను ఎత్తుతున్న కూలీలు

అమలుకాని నిబంధనలు

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్‌తో గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలిసిపోయి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినా వాటిని ఎవరూ వినియోగించడం లేదు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో తక్కువ ధరకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వినియోగదారులు కూడా వీటితోనే సరుకులు తీసుకెళ్తున్నారు.

ప్రకటనలకే పరిమితం

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశామని, విక్రయిస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వీటిని విక్రయించే వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

అవగాహన కల్పించాలి

ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వీటివల్ల కలిగే అనర్థాలపై అతి తక్కువ మందికే తెలియడంతో వినియోగం తగ్గడం లేదు. తక్కువ ధరకు పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు వస్తుండడంతో వీటి వల్ల కలిగే నష్టాన్ని గుర్తించడం లేదు.

– పంచిరెడ్డి కృష్ణ, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఎచ్చెర్ల మండలం

నిబంధనలు అమలు చేయాలి

ప్లాస్టిక్ నివారణకు తీసుకొచ్చిన నిబంధనలు అమలు చేయాలి. పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే వీటి వినియోగం పెరిగి పర్యావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడతారు.

– రెడ్డి గోపాల్ చిన్నయ్యపేట, లావేరు మండలం

ప్రశాంత నగరంలో అశాంతి సృష్టిస్తున్నారు



మాట్లాడుతున్న కోరాడ హరగోపాల్ తదితరులు

- కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు కోరాడ హరగోపాల్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రశాంతతకు పేరుగాంచిన శ్రీకాకుళం నగరంలో ఇటీవల కాలంలో కొందరు దుండగులు, రౌడీ షీటర్లు దారుణంగా వ్యవహరిస్తున్నారని కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు కోరాడ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయం ఎదురుగా ఉన్న తంగుడు ఉపేంద్ర ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌ను నగరానికి చెందిన జామి విష్ణుమూర్తికి అద్దెకిస్తే, అయన చనిపోయిన తర్వాత భార్య ఉండాల్సిన ఇంట్లో వేరే ప్రాంతం నుంచి వచ్చిన కొందరు దూరిపోయి శుక్రవారం రాత్రి అరాచకం సృష్టించడం వెనుక ఉన్నటువంటి వ్యక్తులను బయటకు లాగాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కళింగ వైశ్య కల్యాణ మండపంలో సోమవారం బాధిత తంగుడు ఉపేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జామి విష్ణుమూర్తి భార్య మూడు నెలలుగా ఆ ఇంట్లో లేకపోయినా తాళాలు తీసుకొని దర్జాగా ఇంట్లోకి ప్రవేశించిన దుండగులను ప్రశ్నిస్తే, ఇల్లు తగులబెట్టేస్తామని.. గ్యాస్ సిలెండర్‌ను పేల్చేస్తామంటూ పోలీసులకే హెచ్చరించారన్నారు. పోలీసులు తమ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించడం సరికాదని పేర్కొన్నారు. మద్యం మత్తులోనో, మాదకద్రవ్యాల మత్తులోనో ఉన్న ఈ ముఠా మేడమీద ఉన్న తంగుడు ఉపేంద్ర కుటుంబానికి ఏ రాత్రి సమయంలోనైనా హాని చేసే అవకాశం ఉందన్నారు. ఈ ఘటనలు వెనుక ఒక మాస్టర్ మైండ్ ఉందని, వారిని బయటకు తీయాలని కోరారు. సమావేశంలో తంగుడు ఉపేంద్ర, ఆయన కుటుంబ సభ్యులు, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

శ్రీకాకుళం: సమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్‌లో చేరిన వివిధ రంగాల ప్రముఖులను నగరంలోని కెమిస్ట్ భవనంలో ఆదివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలో పుట్టిన వాకర్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సంస్థలో ప్రతిష్టాత్మకమైన మహాత్మా గాంధీ ఫెలోషిప్‌లో వివిధ రంగాల ప్రముఖులు చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 201 గవర్నర్ గుంటూరి రామరాజు, 302 గవర్నర్ రావెళ్ల మాధవ నాయుడు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ హారిక ప్రసాద్, జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ బి.శ్రీనివాస పట్నాయక్, వాకర్స్ పూర్వ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు, జేసీఐ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, వాకర్స్ 102 కార్యదర్శి సుగంధం సంజీవరావు, కోశాధికారి చదువుల బసవరాజు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొంక్యాన వేణుగోపాల్, నల్లి ఆశా దీపిక, పాండ్రంకి మురళీకృష్ణ, పొట్నూరు నాగేశ్వరరావు, పంచాది నారాయణమూర్తి, సకలాభక్తుల గోవిందరావు, కోరాడ విశ్వనాథం, రవ్వ నారాయణరావు, డాక్టర్ రమేష్‌చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో నగరంలోని మదర్ థెరిస్సా హోమ్‌లో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రభావతి ప్రారంభించారు.

సమాజ సేవకు ముందంజ



మాట్లాడుతున్న కల్యాణ చక్రవర్తి

శ్రీకాకుళం అర్బన్: సమాజ సేవకు రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందంజలో ఉంటుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కల్యాణ చక్రవర్తి అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ అఫీషియల్ విజిట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని అందుకు అనుగుణంగా సేవలందించడం అభినందనీయమన్నారు. కొత్త బ్రిడ్జి వద్దనున్న రోటరీ స్వర్గధామాన్ని పరిశీలించానని, అక్కడ పనులు త్వరితగతిన పూర్తవుతున్నాయన్నారు. అలాగే రోటరీ ఓల్డేజ్ హోంను కూడా పరిశీలించానని, మరింత త్వరగా పనులు పూర్తి చేసి వృద్ధులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మగ్గం, టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. తదుపరి పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎన్‌వీ దుర్గారావు, కింతలి నాగేశ్వరరావు, కోశాధికారి ఎస్.నరసింహమూర్తి, సభ్యులు బాకి సురేష్, అంధవరపు రఘురాం, వై.మురళీమోహనరావు, కేటీ నాయుడు, ఎం.వెంకటేశ్వర్లు, పి.రామారావు, అంధవరపు శ్రీనివాసరావు, షావుకారి నాగేశ్వరరావు, కె.శోభారామకృష్ణ, కె.సుజాత, ఐ.కె.రావు, కేవీ కామేశ్వరరావు, బరాటం భరత్‌భూషణ్, పట్నాల వాసుదేవరావు తదితరులు ఉన్నారు.



సర్టిఫికెట్లతో మగ్గం, టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు

ప్రజాధనం వృథా..!

- డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసిన అధికారులు
- అవగాహన లోపంతో మరలా తొలగించిన వైనం




వేబ్రిడ్జి పక్కన వేసిన డైవర్షన్ రోడ్డును తొలగించి నేరుగా నీరు విడిచిపెట్టిన దృశ్యం



తొలగించిన పైపులు

శ్రీకాకుళం రూరల్: ఆర్అండ్‌బీ అధికారుల ఆశయం మంచిదైనా.. అవగాహన లోపంతో ప్రజాధనం వృథాగా మారింది. ముందస్తుగా ఎటువంటి ప్రణాళికా లేకుండా ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయంతో నీటిలోనే కొట్టుకుపోయింది. మండల పరిధిలోని కొత్తరోడ్ జంక్షన్ నుంచి రాగోలుకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జిపై సింగిల్ వే రాకపోకలు గడిచిన కొంతకాలంగా కొనసాగుతున్నాయి. ఇటీవల దాన్ని డబుల్ వే చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు తీసుకున్న నిర్ణయం బెడిసికొట్టింది. ఈ రహదారిపై రాకపోకలు తీవ్రతరం కావడంతో బ్రిడ్జి పక్కనే డైవర్షన్ రోడ్డును తాత్కాలిక నిర్మాణం చేస్తే కొంత ఊరట లభిస్తోందన్న కోణంలో ఆ దిశగా పనులు చేపట్టారు. దీనికి గానూ రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. రూ.3 లక్షలు విలువ చేసే 8 సిమెంట్ పైపులు, రూ.2 లక్షలు విలువ చేసే గ్రావెల్‌ను ఉపయోగించారు. అయితే రోడ్డు వలన ఎగువ ప్రాంతంలో నీరు నిల్వలు ఎక్కువ కావడం, పంట పొలాల్లో నీరు ఎక్కడికక్కడే ఉండిపోవడంతో రైతుల ఫిర్యాదు మేరకు చేసేదేమీలేక ఆ పైపులను వెంటనే తొలగించారు. దీంతో అధికారులు తీసుకున్న నిర్ణయం పనికిరాకుండా పోయింది.


ట్రాఫిక్ ఎక్కువగా నిలిచిపోతోంది



కొత్తరోడ్ వద్ద ఉదయం, సాయంత్రం పనివేళల్లోనూ, స్కూల్స్, కాలేజీలకు వెళ్లే సమయాల్లోనూ ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోతుంది. పొరపాటున ఏదైనా వాహనం మరమ్మతులకు గురైతే ఆరోజంతా అక్కడ ఉండాల్సిందే. వారానికి నాలుగు రోజులు ట్రాఫిక్‌లోనే ఉండిపోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో డైవర్షన్ రోడ్డు చాలా అవసరం కానుంది.

– రామారావు, ఆటో డ్రైవర్

నిధులు వృథా



డైవర్షన్ రోడ్డు పేరిట ప్రజాధనం వృథా అయ్యింది. పంట పొలాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పైపులు ఏర్పాటు చేసుంటే రైతులు, ప్రజల రాకపోకలకు సులువు మార్గం లభించేది. కానీ ఆర్అండ్‌బీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో ఇబ్బందులు తప్పలేదు.

– వెంకటరావు, శ్రీకాకుళం

రైతులు ఫిర్యాదుతో తొలగించాం

డైవర్షన్ రోడ్డుపై రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేల ఆదేశాలతో పైపులను తొలగించాం. డిసెంబర్ నాటికి నీరు తగ్గుముఖం పడితే డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేస్తాం.

– రాజశేఖర్, ఆర్అండ్‌బీ అధికారి, శ్రీకాకుళం

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలో ఒక ఇంటి వద్ద పూజలు



భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమి

జిల్లాలోని పలుచోట్ల గౌరీ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. నందెన్న, గౌరీదేవి విగ్రహాలను ప్రతిష్టించారు. గౌరీ పౌర్ణమిని పురస్కరించుకొని మహిళలు అందరూ గౌరీదేవిగా భావించి వరుదుబ్బు, తులసీమాతలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పాటలను పాడుతూ ఆనందోత్సాహాలతో సందడి చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



జి.సిగడాం: పెంటలో గౌరీదేవికి పూజలు చేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి పెద్ద మందిరంలో గౌరీ పూర్ణిమ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నందెన్న, గౌరమ్మలను ఏర్పాటు చేసిన దృశ్యం



రణస్థలం: తామాడలో కొలువుదీర్చిన గౌరమ్మ, నందన్న విగ్రహాలు

పవిత్ర స్నానాలు



గౌరీ పూర్ణిమ పురస్కరించుకొని బందరువానిపేట సముద్ర తీరంలో మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో సముద్ర స్నానాలాచరించారు. – గార

ఆలయ వార్షికోత్సవం



రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోవిందనగర్ కాలనీలో ఉన్నటువంటి రాజరాజేశ్వరి ఆలయ వార్షిక ఉత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, చరణ్‌శంకర్ శర్మల ఆధ్వర్యంలో మహిళలచే కలశాలతో ఊరేగింపు, శ్రీచక్రార్చనలు, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిటకిట



బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



పల్లె వెలుగు బస్సులు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



ప్లాట్‌ఫాంల వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం కూడా ప్రయాణికులతో కిటకిటలాడింది. దసరా అనంతరం స్వగ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు, విద్యార్థులతో రద్దీమయంగా కనిపించింది. జిల్లా నుంచి దూర ప్రాంతాలు వెళ్లే ప్రయాణికులు నాన్‌స్టాప్ క్యూలో టికెట్ల కోసం బారులు తీరుతూ కనిపించారు. అలాగే అధిక సంఖ్యలో ప్రయాణికులు పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కోసం వేచి ఉండడం కనిపించింది. సకాలంలో బస్సులు లేకపోవడంతో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అదేవిధంగా కాంప్లెక్స్‌కు వచ్చిన బస్సులు వచ్చినట్లుగానే ప్రయాణికులతో కిక్కిరిసిపోవడం, బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు ఎగబడుతూ ఎక్కడం కనిపించింది.